క్లుప్తంగా

బాలికా విద్యపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన


మాట్లాడుతున్న జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ బుధవారం బాలికా విద్యపై అవగాహన కల్పించారు. ఇంటర్నేషనల్ మలాలా డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జవహర్ మాట్లాడుతూ బాలికలు యుక్తవయస్సులో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శాస్త్రీయ విద్యపై అవగాహన పెంచుకుని మూఢ విశ్వాసాలను విడనాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం వీ శైలజ, డాక్టర్ శారద, జేవీవీ జిల్లా నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుడి జీవనోపాధికి ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: దివ్యాంగుడైన సుధాకర్‌కు జీవనోపాధి కోసం అవసరమైన యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం స్థానిక ట్రస్టు కార్యాలయంలో అందజేశారు. ఉన్నత చదువులు చదివిన సుధాకర్ యాక్సిడెంట్‌లో కుడికాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు ప్రవాస భారతీయుడు మహేష్ తుమ్మల సహకారంతో ల్యాప్‌టాప్, ప్రింటర్ కొనుగోలు కోసం రూ.80 వేలను దివ్యాంగుడికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా, మార్శెట్ల సుబ్బారావు, షేక్ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ కోసం పేర్లు నమోదు చేసుకోండి

చీరాల రూరల్: ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో లైసెన్సు కలిగిన రిఫరీలు, కోచ్‌లు, అన్ని వయస్సుల విభాగాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం బాపట్ల జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. దేవదాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేదంటే జిల్లా సంఘం పరిగణలోనికి రారని పేర్కొన్నారు. త్వరలో అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 8309607343, 9490336238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంపై హర్షం

చీరాల అర్బన్: ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 12 వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేష్, దండమూడి శాంతారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేయడానికి ఇది ఓ ఉదాహరణ అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చినగంజాంలో ఆపరేషన్ కవచ్


తీరప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

చినగంజాం: రాష్ట్రంలో తీరప్రాంత భద్రతను పరిరక్షించడానికి నిర్వహించే ఆపరేషన్ కవచ్ కార్యక్రమాన్ని చినగంజాం మండలంలోని తీర ప్రాంతంలో ఎస్ఐ కె. సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు పోలీసుల సంసిద్ధతను అంచనా వేయడానికి కోస్టల్ గార్డ్స్, మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి నిర్వహించే కార్యక్రమం ఆపరేషన్ కవచ్ అంటారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ఆపరేషన్ సాగర్ కవచ్ నిర్వహించనున్నట్లు ఇందులో బుధ, గురు వారాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ తన సిబ్బందితో మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దర్శి: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు ఢీకొని ఆదాం అనే యువకుడికి గాయాలైన సంఘటన లంకోజనపల్లి రోడ్డులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదాం దర్శిలో తన పనులు ముగించుకుని స్వగ్రామమైన పొదిలి మండలం ఈగలపాడుకు వెళుతున్నాడు. ఎదురుగా వ్యక్తి మోటారు సైకిల్ ఢీకొనడంతో రెండో వ్యక్తికి కూడా వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా ఆదాంకు తీవ్రగాయాలు అయ్యాయి. 108వాహనంలో ఆదాంను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తీసుకువెళుతున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న సురక్షతో భారీ లబ్ధి

- ఒక్క చెరువుకొమ్ముపాలెంలోనే 1200 మందికి సేవలు
- లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత


చెరువుకొమ్ముపాలెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమాలతో ప్రజలకు భారీగా లబ్ధిచేకూరుతోందని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. ఒంగోలు నగరంలోని 18వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా చెరువుకొమ్ముపాలెంలో 1200 మందికి లబ్ధిచేకూరిందని చెప్పారు. 18వ డివిజన్ కార్పొరేటర్‌గా, మేయర్‌గా ప్రజలకు సేవ చేసుకునేందుకు తనకు అవకాశం కల్పించిన ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చెరువుకొమ్ముపాలేనికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానన్నారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రజలకు ఉత్తమ సేవలందించిన వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, ఏఎన్ఎం, వలంటీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈ కే మాల్యాద్రి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలన్నీ ఉచితం : కమిషనర్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఒంగోలు నగరంలోని 17వ డివిజన్ పెళ్లూరులో బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ పెళ్లూరులో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి రిజిస్ట్రేషన్ చేసుకున్న మొత్తం 548 మందికి లబ్ధిచేకూర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెండు డివిజన్లలో ఇంటింటి సర్వే...

నగరంలోని రెండు డివిజన్లలో బుధవారం జగనన్న సురక్ష ఇంటింటి సర్వే నిర్వహించారు. 24వ డివిజన్‌లోని కోటవీధి, వంటవారికాలనీల్లో, గాంధీ రోడ్డు సచివాలయం పరిధిలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు.


ఉలిచిలో సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉలిచిలో...

ఒంగోలు రూరల్: మండలంలోని ఉలిచి సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ మంచు మురళి అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ పి.మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు చుంచు రామకృష్ణ, చుంచు శేషయ్య, శేషగిరి, కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొని 2 వేల మందికి వివిధ సర్టిఫికెట్లు అందజేశారు.


పెళ్లూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని ఆలూరులో సర్పంచ్ పూనూరి మాధవి అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నం-1 సచివాలయంలోనూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నంలో 97 మందికి, ఆలూరులో 176 మందికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పూనూరు శైలేష్, గాదె కోటిరెడ్డి, గుత్తికొండ జాలిరెడ్డి, ఎంఎల్‌వో అశోక్‌రెడ్డి, ఆర్.వెంకట్రావు, అదిత్య పవన్ తదితరులు పాల్గొన్నారు.


మద్దిరాలపాడులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

రాచవారిపాలెంలో...

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. గొప్పగొప్ప కార్యక్రమాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న నాయకులనే మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు పిట్టల ఆంజనేయులు, గుడ్డపాతల రవి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సర్పంచ్ పురాలశెట్టి నాగమల్లీశ్వరి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, పైనం శ్రీనివాసరావు, కీర్తిపాడులో సర్పంచ్ తిప్పారెడ్డి సీతమ్మ, తహసీల్దార్ రజనీకుమారి ఏవో సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


చిలకపాడులో సర్టిఫికెట్లు అందిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చిలకపాడులో 1,067 మందికి సర్టిఫికెట్ల పంపిణీ...

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో 1,067 మందికి సర్టిఫికెట్లు అందించారు. మండలంలోని పీ గుడిపాడు, కొనగానివారిపాలెం గ్రామాల్లోనూ 760 సర్టిఫికెట్లు అందించారు. ఆయా కార్యక్రమాలలో మండల స్పెషలాఫీసర్ టీ ఉషారాణి, తహసీల్దార్ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, దుంపా యలమందారెడ్డి, సర్పంచ్‌లు కే పుష్ప, ఎస్.మల్లయ్య, ఎంపీటీసీ సుజాత, టీ శేషిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలం పల్లామల్లిలో...

చీమకుర్తి మండలం పల్లామల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం గోనుగుంట గ్రామంలో ఎస్సీకాలనీ నుంచి సచివాలయం వెళ్లేదారిలో రూ.15 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ముప్పవరపు తిరుపతమ్మ, ఎంపీటీసీ గండి నాగమ్మ, రామసాని సూర్యచంద్రరావు, నల్లపాటి పెద్దబ్బాయి, గండి రోశయ్య, రమేష్, సాదు వెంకటరత్నం మోహన్‌రావు, ఉప్పలపాటి వెంకట్రావు, తన్నీరు శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ మేలు చేయడమే జగనన్న లక్ష్యం...

నాగులుప్పలపాడు: ప్రతిఒక్కరికీ మేలు చేయడమే జగనన్న లక్ష్యమని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మద్దిరాలపాడు గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందని, ఆయనను మరోమారు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, ఎంపీటీసీ సంతోష్, మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాల సర్పంచ్‌లు అనూరాధ, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


రాచవారిపాలెంలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో, నాయకులు


ఆలూరులో సర్టిఫికెట్లు అందిస్తున్న సర్పంచ్ మాధవి, అధికారులు, లబ్ధిదారులు


పల్లామల్లిలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

వలంటీర్లకు వందనం

వలంటీర్ రమేష్‌రెడ్డి సేవలు మర్చిపోలేమంటున్న ప్రజలు


కోటి రమేష్‌రెడ్డి, వలంటీర్

చీమకుర్తి: చీమకుర్తిలోని 4వ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ కోటి రమేష్‌రెడ్డి తనకు కేటాయించిన 50 కుటుంబాల ప్రజలకు వారు మర్చిపోలేనంతగా మెరుగైన సేవలందిస్తూ మన్ననలు పొందుతున్నాడు. కరోనా సమయంలో అకస్మాత్తుగా విధించిన లాక్‌డౌన్‌తో హైదరాబాద్‌లో చిక్కుకుపోయిన తన పరిధిలోని కుటుంబాలకు చెందిన బొజ్జా తిరుపతమ్మ, ఆమె మరిది కిట్టయ్య, కొడుకు ప్రసాద్, పెద్దమ్మ కోటమ్మలను చీమకుర్తికి తీసుకొచ్చేందుకు ఎంతో శ్రమించాడు. ఒంగోలులోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మాట్లాడి పర్మిషన్ పేపర్లు సిద్ధం చేసి హైదరాబాద్‌లోనే ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి తిరుపతమ్మ కుటుంబాన్ని చీమకుర్తికి తీసుకురాగలిగాడు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా సేవాభావంతో పనిచేసి శభాస్ అనిపించుకున్నాడు. అదే.. ఆ వలంటీర్ లేకుంటే ఆ సమయంలో ఆ కుటుంబం పరిస్థితి ఎంతో దయనీయంగా మారేది. రమేష్‌రెడ్డి చేసిన మేలు ఎప్పటికీ మరవలేమని ఆ కుటుంబం కొనియాడుతోంది. ఇలాంటి ఎన్నో సేవలను వలంటీర్ల ద్వారా పొందుతున్న ప్రజలు.. వారిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

కరోనా లాక్‌డౌన్ సమయంలో హైదరాబాద్ నుంచి వలంటీర్ తీసుకొచ్చాడు

కరోనా కష్టకాలంలో మా వలంటీర్ కోటి రమేష్‌రెడ్డి మాకు చాలా సాయం చేశాడు. వ్యాపారం కోసం నెలకొకసారి హైదరాబాద్ బేగం బజారుకు నేను వెళ్తాను. వెంట్రుకలు, ఫ్యాన్సీ సామగ్రి కొనుగోలు చేసి రెండుమూడు రోజులు హైదరాబాద్‌లో ఇతర పనులు చూసుకుని తిరిగి చీమకుర్తి వస్తాను. కరోనా రాక ముందు ఎప్పటిలాగే నేను, మా మరిది కిట్టయ్య, కొడుకు ప్రసాద్, పెద్దమ్మ కోటమ్మ హైదరాబాద్ వెళ్లాం. అకస్మాత్తుగా ఆ మరుసటి రోజు నుంచే లాక్‌డౌన్ విధించడంతో హైదరాబాద్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. హైదరాబాద్ నుంచి చీమకుర్తి రావడానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. అదే సమయంలో మా వలంటీర్ రమేష్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పాం. ఎలాగైనా చీమకుర్తి వచ్చేలా చేయమని అడిగాం. మా వలంటీర్ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మేమంతా హైదరాబాద్ నుంచి చీమకుర్తి రావడానికి కావాల్సిన పేపర్లు సిద్ధం చేసి హైదరాబాద్‌లో మాకు ప్రత్యేకంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేయించాడు. దాంతో తిరిగి చీమకుర్తి వచ్చాం. మా వలంటీర్ దేవుడిలా ఆ రోజు మాకు చేసిన సాయం వలనే చీమకుర్తి రాగలిగాం. చీమకుర్తి వచ్చిన తర్వాత కూడా లాక్‌డౌన్ కారణంగా తిండి గింజలు, కూరగాయలు లేక ఇబ్బంది పడుతుంటే దాతల సహకారంతో తిండికి ఇబ్బంది లేకుండా మా వలంటీర్ రమేష్‌రెడ్డి చూశాడు. కరోనా సమయంలో వలంటీర్ చేసిన మంచి ఎప్పటికీ మరిచిపోలేము.


బొజ్జా తిరుపతమ్మ, కిట్టయ్య

నాగులుప్పలపాడు మండలంలో భారీ వర్షం

- 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

నాగులుప్పలపాడు: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో భాగంగా నాగులుప్పలపాడు మండలంలో భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సుబ్బారావు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. బీ నిడమానూరు గ్రామంలో వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

ఒంగోలు మండలంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలతో గ్రామాల్లోని పంట పొలాలు పదునెక్కాయి. ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెట్టపొలాల్లో జొన్న, ముదురు జొన్న, జూట్, మిరప, చిరుధాన్యాల పంటలు వేసేందుకు అనుకూలమైన సీజన్ అని రైతులు తెలిపారు. ఉలిచి చెక్‌డ్యాం కింద దేవరంపాడు, ఉలిచి, కరవది, చేజర్ల గ్రామాల్లోని మాగాణిలో వరినారు పోసేందుకు నారు మడులు సిద్ధం చేస్తున్నారు. గుండ్లకమ్మ నదీపరివాహక ప్రాంతంలో పొగనారుమడులు, మిర్చినారుమడులు పోస్తున్నారు. మండలంలో విస్తారంగా సాగుచేసిన జామాయిల్ తోటలు మరింతా ఏపుగా పెరిగేందుకు వర్షం ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మద్దిపాడు: ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు మండలంలోని కొష్టాల సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఒంగోలు మండలంలోని చేజర్ల గ్రామానికి చెందిన షేక్ దరియా సాహెబ్ (62) గుండ్లాపల్లికి సొంత పనిపై వచ్చి తన మోటార్ సైకిల్‌పై తిరుగు ప్రయాణంలో ఒంగోలువైపు వెళ్తుండగా కొష్టాల సెంటర్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తల వెనుక భాగం, నుదుటిపై తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది వృద్ధుడిని ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.


గాయపడిన వృద్ధుడిని హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎన్‌సీసీతో ఉన్నత భవిత


ఎన్‌సీసీ క్యాడెట్లకు సూచనలందిస్తున్న గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ చంద్రశేఖర్


శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

చీరాల టౌన్: దేశసేవతో పాటు సమాజసేవలో ఎన్‌సీసీ క్యాడెట్ల పాత్ర అపారం. స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో 23 ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లోని కళాశాలలు, జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు కంబైన్డ్ యాన్యువల్ ట్రెనింగ్ ఎన్‌సీసీ క్యాంపు-5 (సీఏటీసీ) బుధవారం ప్రారంభమైంది. 600 మంది జూనియర్స్, సీనియర్స్ వింగ్స్‌కు చెందిన బాలబాలికలు పాల్గొన్నారు. పది రోజుల పాటు మిలటరీ తరహాలో ప్రత్యేక శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ నేర్చుకుంటున్నారు. క్యాంపు కమాండెంట్, లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ గౌతమ్ స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, పచ్చదనం పరిశుభ్రత, రక్తదానం తదితర సేవాకార్యక్రమాల్లో ముందుండాలని వివరిస్తున్నారు. మంచి తర్ఫీదు సాధించిన క్యాడెట్లను ఆర్డీసీ, టీఎస్సీ క్యాంపులకు ఎంపికచేసి ఈసంవత్సరం ఢిల్లీలో జరిగే వేడుకల్లో హాజరు పరుస్తారు. గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ సీవో ముకుందన్, మేజర్ అంజిరెడ్డి, బాపయ్యశెట్టి, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

ముఠా వర్కర్ల కూలి పెంపుదల

మార్కాపురం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతమార్కెట్ ముఠా వర్కర్ల కూలీ ధర పెంచేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు సీపీఐ నాయకుడు అందె నాసరయ్య, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాశీం తెలిపారు. బుధవారం జరిగిన చర్చల్లో యజమానులు 30 శాతం కూలీ పెంచేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. చర్చల్లో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, యజమానుల తరుపున ఉటుకూరి మాధవరావు, భాస్కరరావు, గిరిబ్రహ్మం, రమేష్, కార్మికుల తరుపున రమణ, గైకోటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

మార్కాపురం టౌన్: సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను ఈనెల 15,16వ తేదీల్లో మార్కాపురం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సోమయ్య, బాల నాగయ్య, డీకెఎం రఫీ, రూబెన్, రాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట డీఆర్‌ఓ వంశీకృష్ణపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట బుధవారం గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా డీఆర్‌ఓ.. ఎస్టీలపై దాడులు నిర్వహిస్తూ వేధిస్తున్నాడని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన నాయకులు సుబ్బునాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, దిగువమెట్ట తండా సర్పంచి అంజినాయక్ పాల్గొన్నారు.

ఏఎంసీ చెక్‌పోస్ట్ ప్రారంభం

దర్శి: మండలంలోని రాజంపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును దర్శి ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ కరోనా సమయంలో వ్యవసాయ సాగు చట్టాలు ఉన్నప్పుడు రాజంపల్లి చెక్‌పోస్టు తీసివేయడం జరిగిందన్నారు. తిరిగి చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. సాగు చట్టాలు రద్దుచేసిన అనంతరం మళ్లీ రాజంపల్లిలో చెక్‌పోస్ట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ పన్నును ఈ చెక్‌పోస్ట్ ద్వారా వసూలు చేయనున్నట్లు చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

కురిచేడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతరావునాయక్ తెలిపారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు తగు సమాచారంతో రావాలని ఆయన కోరారు.

బలహీన వర్గాలు ఐక్యం కావాలి

గిద్దలూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ప్రజలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని బీసీ నాయకులు పెట్టెల నారాయణ యాదవ్ అన్నారు. పట్టణంలోని జ్యోతిరావుపూలే పార్కు ఆవరణలో బుధవారం ప్రజా సింహ గర్జన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఈ నెల 23వ తేదీన గుంటూరులో బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ప్రజా సింహ గర్జనకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. బీసీ నాయకులు ఓ.వెంకటయ్య యాదవ్, తొండమల్ల బ్రహ్మయ్య, కమ్మనేతుల విజయరాజు, పెట్టెల శ్రీరామ్, కోటిలింగాచారి, షేక్ యూసఫ్, డేవిడ్, శాంతకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బదిలీ

- విద్యార్థులు కన్నీటి పర్యంతం

తర్లుపాడు: స్థానిక ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో గత 28 సంవత్సరాలుగా ప్రధానో పాధ్యాయునిగా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన శ్రీహరిచక్రవర్తి బదిలీపై త్రిపురాంతకం మండలం గొల్లవాండ్లపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు, గ్రామస్తులు శ్రీహరిచక్రవర్తి సేవలను కొనియాడారు. పాఠశాల విద్యార్థులు మాత్రం కంటతడి పెట్టారు. ఇక్కడే ఉండాలంటూ అభ్యర్థించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.కృష్ణారావు, రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ ముసలయ్య, ఉపాధ్యాయులు పాల్, సచివాలయ ఉద్యోగులు రవితేజ, శ్రీధర్‌రెడ్డి, శంకర్, ఎమ్మార్పీ ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయులు మురారి శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తోటి సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు

పొదిలి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా కరీమున్

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పి.కరీమున్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ, మర్రిపూడి ఎంఈఓగా బదిలీపై వెళ్తున్న ఈవీ రంగయ్య.. నూతన హెచ్‌ఎంను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బీవీ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం ఎస్ఐగా సుమన్

త్రిపురాంతకం: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్ఐగా సుమన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మార్కాపురం రూరల్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ జీవీ సైదులు ఒంగోలు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల సాధారణ బదిలీల్లో సుమన్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఈయనను పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.